క్లుప్తంగా

మద్యం తాగి వాహనాలు నడపరాదు



ధరూరు: వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడపరాదని, దాని వల్ల ఎన్నో అనర్థాలు జరుగుతాయని ఎస్‌ఐ శ్రీహరి హెచ్చరించారు. వాహన తనిఖీల్లో భాగంగా గురువారం మండలంలోని రేవులపల్లిలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ సందర్భంగా డ్రంకెన్ డ్రైవ్‌లో కేసులు నమోదు చేసినట్లు వారు తెలిపారు. మద్యం వల్ల కలిగే నష్టాలను వివరించారు.

బార్ అసోసియేషన్ సమస్యలు పరిష్కరించండి



అలంపూర్: బార్ అసోసియేషన్ సమస్యలను పరిష్కరించాలని అలంపూర్ బార్ అసోసియేషన్ చైర్మన్ గవ్వల శ్రీనివాసులు కోరారు. హైదరాబాద్‌లో బార్ కౌన్సిల్ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అలంపూర్ బార్ అసోసియేషన్ సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ నర్సింహారెడ్డికి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. బార్‌లో లైబ్రరీ, ఫర్నీచర్ ఇతర సమస్యలను పరిష్కరించాలని వినతిలో కోరినట్లు పేర్కొన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన అధికారులు



అయిజ: మండలంలోని పులికల్ గ్రామంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఐకేపీ డిప్యూటీ ప్రాజెక్ట్ మేనేజర్ రామ్మూర్తి, మండల వ్యవసాయ అధికారి జనార్దన్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఏఓ జనార్దన్ మాట్లాడారు. మండలంలోని కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం కొనుగోలు చేసే ప్రక్రియ పూర్తయ్యిందని, పులికల్ గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో కేవలం 17 ధాన్యం రాశులు మాత్రమే ఉన్నాయన్నారు. వాటిని కొనుగోలు చేసిన అనంతరం కొనుగోలు కేంద్రాలను మూసివేస్తున్నట్లు తెలిపారు.ఏఈఓ శివ కుమార్, ఐకేపీ సీసీ జయన్న పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి పీఠాధిపతుల పూజలు



ధరూరు: మండలంలోని పెద్ద చింతరేవుల శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో ఉడిపి శిరూర్ మఠం పీఠాధిపతులు వేద వర్ధన స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ ధర్మకర్త గిరిరావు తెలిపారు. అంతకు ముందు ఆలయానికి చేరుకున్న పీఠాధిపతులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తనూరు విద్యార్థుల ప్రతిభ

అయిజ: గతేడాది నవంబర్ 24న నిర్వహించిన జాతీయ సాధన అర్హత పరీక్షలో మండలంలోని ఉత్తనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు అమ్రేష్ కుమార్, యాకోబులు అర్హత సాధించారు. వారికి నాలుగు సంవత్సరాలు రూ.12వేల చొప్పున ఉపకార వేతనం లభించనుంది. గురువారం విడుదలైన ఫలితాల్లో వీరి పేర్లు రావడంతో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సోమశేఖర్ రెడ్డి, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు విద్యార్థులను అభినందించారు.

పశువులకు టీకాలు వేయించండి

శాంతినగర్: పశువులకు సంక్రమించే ముద్దచర్మ వ్యాధి నివారణ టీకాలను తప్పనిసరిగా వేయించాలని పశువైద్యశాల డాక్టర్ స్వరూపారాణి పశుపోషకులకు సూచించారు. బుడమర్సులో గురువారం ముద్దచర్మ వ్యాధి (లంపిస్కిన్) నివారణ టీకాలు వేశారు. ఈనెల 25 వరకు ఉచితంగా టీకాలు వేస్తామన్నారు. కార్యక్రమంలో వీఎల్‌ఓ వరప్రసాద్, సిబ్బంది బుచ్చమ్మ, పాలాగు పాల్గొన్నారు.

రాయితీ పరికరాలకు మంగళం!



సాసనూలులో ఎద్దులతో అచ్చుకొడుతున్న రైతులు

- కనుమరుగవుతున్న సబ్సిడీ పథకాలు
- ప్రతి ఏటా తగ్గుతున్న వైనం
- పెరుగుతున్న సాగు ఖర్చులు
- ఇబ్బందులు పడుతున్న అన్నదాతలు
- నియోజకవర్గంలో 88,824 మంది రైతులు



ఎర్రవల్లిలో ట్రాక్టర్‌తో విత్తుతున్న రైతు

ఆయా మండలాల వారిగా రైతులు..

మండలం	రైతులు
ఇటిక్యాల	18,126
మానవపాడు	10,175
ఉండవెల్లి	10,717
అలంపూర్	9,519
రాజోళి	9,971
వడ్డేపల్లి	9,657
అయిజ	20,659

ఎర్రవల్లి: ఆధునిక వ్యవసాయం రోజురోజుకు ప్రశ్నార్థకంగా మారుతోంది. వ్యవసాయ సాంకేతికత, యాంత్రీకరణ పరిజ్ఞానం ఆశించిన స్థాయిలో రైతులకు చేరడం లేదు. మారుతున్న కాలానికి అనుగుణంగా తక్కువ పెట్టుబడితో వ్యవసాయం చేసి అధిక దిగుబడులు సాధించాలనే లక్ష్యంతో వ్యవసాయశాఖ చేస్తున్న ప్రచారం కార్యరూపం దాల్చడం లేదు. వ్యవసాయ రాయితీ పథకాలు ఒక్కొక్కటిగా అటకెక్కుతున్నాయి. దీంతో రైతుల ఆశలపై నీళ్లు చల్లుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వ్యవసాయ యాంత్రీకరణ పథకాల మంజూరును గత ప్రభుత్వం పక్కన పెట్టడంతో పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. దీంతో సబ్సిడీపై నూతన ప్రభుత్వం అందజేసే యంత్రాల కోసం అన్నదాతలు ఎదురుచూస్తున్నారు.

అందని ద్రాక్షలా రాయితీ పనిముట్లు..

అలంపూర్ నియోజకవర్గంలో 7మండలాలు, 124 గ్రామ పంచాయతీలున్నాయి. మొత్తం 88,824 మంది రైతులు కేవలం వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు ఉపయోగపడే పథకాలు, సబ్సిడీ ద్వారా వ్యవసాయ పరికరాలను ప్రభుత్వం ప్రతిఏటా అందించేది. దీనిలో భాగంగా రోటవేటర్, కల్టివేటర్, థైవాన్ స్ప్రేయర్లు, మినీ ట్రాక్టర్లు, టార్పాలిన్ కవర్లు, నాగళ్లతో పాటు తదితర వ్యవసాయ పనిముట్లను ప్రభుత్వం సబ్సిడీ ద్వారా రైతులకు అదించేవారు. పదేళ్లుగా అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాయితీపై అందజేసే పనిముట్లు అందని ద్రాక్షలా మారడంతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ప్రతిఏటా నిలిచిపోతున్న పథకాలు..

వ్యవసాయ రాయితీ పరికరాలు ఒక్కొక్కటిగా 2006–07 నుంచి నిలిచిపోయాయి. సేద్యంలో రైతులకు ఎక్కువగా ఉపయోగపడే నాగళ్లు, ఇతర పనిముట్లు 2014లోనే నిలిచాయి. పంట పొలాల్లో ఎద్దులతో పనిచేయాలంటే నిత్యం ఇబ్బందులు పడుతున్నట్లు రైతులు వాపోతున్నారు. 2016–17 ఆర్థిక సంవత్సరం వరకు అందుబాటులో ఉన్న 10 నుంచి 12 రకాల వ్యవసాయ పనిముట్లు ఆ తరువాత పూర్తిగా కనుమరుగయ్యాయి. దీంతో అన్నదాతలకు అత్యవసరమైన వ్యవసాయ పరికరాలు రాయితీలపై అందకుండా పోతున్నాయి. దీనివల్ల తప్పనిసరి పరిస్థితుల్లో రెట్టింపు ఖర్చు చేసి రైతులు మరింత అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు.

పనిముట్ల మంజూరు అంతంత మాత్రమే..

యాంత్రీకరణ రాయితీ పరికరాలు ఒక్కొక్కటిగా నిలిచిపోతుండగా మరోపక్క మంజూరయ్యే యూనిట్లు కూడా నామమాత్రంగా ఉంటున్నాయి. వ్యవసాయ పరికరాలలో భాగంగా థైవాన్ స్ప్రేయర్ లకు మంగళం పాడిన వ్యవసాయశాఖ వాటి స్థానంలో గతేడాది రీచార్జి స్ప్రేయర్‌లను అంతంత మాత్రంగా మంజూరు చేసింది. రైతులకు నిత్యావసరంగా మారిన టార్పాలిన్ కవర్లు కూడా చాలా వరకు తగ్గిపోయాయి. కల్టివేటర్లు మాత్రం జాడే లేదు. గతంలో కొనసాగిన వ్యవసాయ సబ్సిడీ యాంత్రీకరణ పథకాన్ని యథావిధిగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని రైతులు కోరుతున్నారు.

వ్యవసాయ పరికరాలు అందజేయాలి



గతంలో ప్రభుత్వం ప్రతి ఏటా సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు అందజేసేది. ఈ ఏడాది మాత్రం పూర్తి స్థాయిలో అందించలేదు. దీంతో వ్యవసాయానికి అవసరమైన పనిముట్లను ప్రైవేట్ దుకాణంలో కొనుగోలు చేస్తున్నాం. ధరలు అధికంగా ఉండటంతో పాటు నాణ్యత సక్రమంగా లేకుండా ఉన్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులకు సబ్సిడీపై పనిముట్లను అందజేయాలి.

– రవికుమార్, రైతు, కారుపాకుల

అన్నదాత ఇబ్బందులు..



ప్రభుత్వం సబ్సిడీపై పంపిణీ చేసే వ్యవసాయ యంత్రాలు నిలిచిపోవడంతో రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేట్‌లో అప్పులు చేసి అధిక ధరలకు కొనుగోలు చేయాలంటే చాలా ఇబ్బందిగా ఉంది. ప్రభుత్వం వెంటనే వ్యవసాయ పరికరాలను, యంత్రాలను అందజేసి రైతులకు ఆదుకోవాలి.

– చిన్న వీరన్న, రైతు, గార్లపాడు

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం..



ప్రభుత్వం నుంచి వ్యవసాయశాఖ ద్వారా రైతులకు రావాల్సిన సబ్సిడీ పరికరాల విషయంపై గతంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఈ ఏడాది కొంత మేరకు వచ్చిన పరికరాలను రైతులకు సబ్సిడీ ద్వారా నేరుగా అందజేశాం. రైతుల సమస్యను మరోసారి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. ప్రభుత్వం నుంచి ఏవైనా పరికరాలు, యంత్రాలు వస్తే రైతులకు సమాచారం అందించి సబ్సిడీపై పంపిణీ చేస్తాం.

– సక్రియనాయక్, జిల్లా వ్యవసాయ అధికారి

రైతుల సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

- అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ



తాటికుంట రెవెన్యూ సదస్సును పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ

మల్దకల్: భూ సమస్యలతో ఎంతో కాలంగా ఇబ్బంది పడుతున్న రైతులకు భూ భారతి చట్టం ద్వారా పరిష్కారమవుతాయని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ రైతులకు సూచించారు. గురువారం మండలంలోని బూడిదపాడు, తాటికుంట గ్రామాలలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులను జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యలను రెవెన్యూ సదస్సులలో పరిష్కరించుకునే విధంగా ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మొత్తం ఆయా గ్రామాలలో 49 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీటీ ఝాన్సీరాణి, అధికారులు, రైతులుపాల్గొన్నారు.

■ అయిజ మండలంలోని వెంకటాపురంలో జాయింట్ కలెక్టర్ లక్ష్మీనారాయణ, తహసీల్దార్ జ్యోతి రెవెన్యూ సదస్సుకు హాజరయ్యారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

సమస్యల పరిష్కారానికి దరఖాస్తుల స్వీకరణ

■ అలంపూర్ మండలంలోని జిల్లెలపాడులో తహసీల్దార్ మంజుల రెవెన్యూ సదస్సు నిర్వహించారు.

■ శాంతినగర్ పరిధిలోని వడ్డేపల్లి మండలం జిల్లెడుదిన్నెలో 20 దరఖాస్తులు వచ్చినట్లు డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

■ మానవపాడు మండలంలోని చిన్నపోతులపాడు, పెద్దపోతులపాడు గ్రామాలలో తహసీల్దార్ జోషి శ్రీనివాస్‌శర్మ రైతులకు అవగాహన కల్పించారు. చిన్నపోతులపాడులో 21, పెద్దపోతులపాడులో 29 దరఖాస్తులు వచ్చాయన్నారు.

■ గట్టు మండలంలోని తప్పెట్లమొర్సు, ముసలంపల్లి (బల్గెర) గ్రామాల్లో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తప్పెట్లమొర్సులో 21 దరఖాస్తులు, ముసలంపల్లి(బల్గెర)లో 5 దరఖాస్తులు వచ్చినట్లు డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు.

■ కేటీదొడ్డి మండలం ఈర్లబండ గ్రామంలో రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ హరికృష్ణ, డీటీ శివశంకర్ దరఖాస్తులు స్వీకరించారు.

■ రాజోళి మండలంలోని తూర్పు గార్లపాడులో రెవెన్యూ అధికారులు దరఖాస్తులు స్వీకరించారు.



పెద్దపోతులపాడులో దరఖాస్తులు తీసుకుంటున్న తహసీల్దార్ జోషి శ్రీనివాస్‌శర్మ



జిల్లెడుదిన్నెలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఇన్‌చార్జి తహసీల్దార్ వీరభద్రప్ప

మానసిక ప్రశాంతతకు యోగా దోహదం



ఇటిక్యాలలో యోగాపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ఇటిక్యాల: ప్రతి ఒక్కరిలో మానసిక ప్రశాంతత పెంచేందుకు యోగా దోహద పడుతుందని ఆయుష్ మండల వైద్యాధికారి ముబీనా తబాసుమ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో యోగా దశాబ్ది ఉత్సావాలలో భాగంగా రాష్ట్ర ఆయూష్ విభాగం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న యోగా మాసోత్సవాలలో పాల్గొని ఆమె మాట్లాడారు. అనునిత్యం యోగా సాధన చేయడం వల్ల ప్రజలకు మానసిక, శారీరక ఆరోగ్యంతో పాటు ప్రశాంతత చేకూరుతుందన్నారు. ఆయూష్ సేవలను మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం జూన్ 21 వరకు మండలంలోని అన్ని గ్రామాలలో ఆయూష్ డిపార్ట్ మెంట్ నేతృత్వంలో ప్రజా అవగాహన సదస్సులు, కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో యోగా బోధకులు నరేష్, శివాని, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, చిన్నారులు పాల్గొన్నారు.

రాయితీపై జీలుగు విత్తనాలు

- పీఏసీఎస్ చైర్మన్ మోహన్ రెడ్డి



రైతులకు జీలుగ విత్తనాల పంపిణీ చేస్తున్న అధికారులు

అలంపూర్: రైతులకు రాయితీపై జీలుగు విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ మోహన్ రెడ్డి అన్నారు. అలంపూర్ పట్టణంలోని పీఏసీఎస్ వద్ద రాయతీపై జీలుగు విత్తనాల పంపిణీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. పీఏసీఎస్ చైర్మన్ మోహన్‌రెడ్డి, మండల వ్యవసాయ శాఖ అధికారి నాగార్జున్‌రెడ్డిలు రైతులకు రాయితీపై విత్తనాలు అందజేశారు. మండల వ్యవసాయ శాఖ అధికారి మాట్లాడుతూ రైతులకు పచ్చిరొట్ట ఎరువులకు జీలుగు విత్తనాలు అందించినట్లు పేర్కొన్నారు. సహకార సొసైటీల ద్వారా జీలుగు విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. జీలుగు విత్తనాల 30 కిలోల బస్తా రైతులకు రాయితీ మినహాయించగా, రూ.2137 అందజేయనున్నట్లు తెలిపారు. రాయితీపై జీలుగు విత్తనాలు పొందడానికి పట్టాదారు పాస్ బుక్, ఆధార్ కార్డుతో వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ కార్యదర్శి శ్రీనివాసులు, వ్యవసాయ విస్తరణ అధికారులు సాయిరాం, నవీన్, రైతులు, తదితరులు ఉన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం



అలంపూర్‌లో వాక్ విత్ కమిషనర్



అయిజలో మొక్కలు నాటుతున్న మున్సిపల్ కమిషనర్ సీహెచ్ సైదులు

అలంపూర్: పర్యావరణాన్ని కాపాడుకుందామని మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్ రావు అన్నారు. అలంపూర్ మున్సిపాలిటీలో 100 రోజుల ప్రణాళికలో భాగంగా గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కోర్టు నుంచి చౌక్ బజార్, గాంధీ చౌక్, బాలబ్రహ్మేశ్వర స్వామి జోగుళాంబ అమ్మవారి ఆలయాల వరకు వాక్‌విత్ కమిషనర్ ర్యాలీ చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ.. మనిషి మనుగడకు పర్యావరణం అవసరమ న్నారు. అందుకే పర్యావరణాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కిరాణషాపులు, హోటళ్లు, వ్యాపారులు తప్పనిసరిగా లైసెన్స్‌లు పొందాలన్నారు. ఆన్‌లైన్‌లోనే లైసెన్స్‌లు పొందాలన్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు.

■ **అయిజ:** మొక్కలు విరివిగా నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ సైదులు అన్నారు. మున్సిపాలిటీలోని 2వ వార్డులో వనమహోత్సవ్ నిర్వహించి మొక్కలు నాటారు.

■ మానవపాడు మండల కేంద్రంలో ఎంపీడీఓ భాస్కర్ ఆధ్వర్యంలో మొక్కలు నాటుతున్నామన్నారు. కార్యక్రమంలో ఏపీఓ విజయ్‌శంకర్, భాషా, సిబ్బంది ఉన్నారు.

■ ఇటిక్యాల మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంపీడీఓ అజార్ మొహియుద్దీన్, మండల వైద్యాధికారి డాక్టర్ రాధిక మొక్కలు నాటారు. ప్లాస్టిక్ వాడకం తగ్గించి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ముబీనా తబసుమ్, పంచాయతీ కార్యదర్శి రమేష్, వైద్య సిబ్బంది ఉన్నారు.

■ గట్టు మండలం బోయలగూడెంలో ఎంపీడీఓ చెన్నయ్య, పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులతో కలిసి మొక్కలు నాటారు.

బల్గెరలో నీటి సమస్యపై విచారణ



బల్గెరలో తాగునీటి సమస్యపై ఆరా తీస్తున్న అధికారులు

గట్టు: మండలంలోని బల్గెర గ్రామంలో దళిత కాలనీలో గురువారం ఎంపీడీఓ చెన్నయ్య, మిషన్ భగీరథ అధికారులతో కలిసి తాగునీటి సమస్యపై విచారణ చేపట్టారు. గ్రామంలోని దళిత కాలనీకి నాలుగు రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడంతో కాలనీ వాసులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో మిషన్ భగీరథ అధికారులతో కలిసి ఎంపీడీఓ చెన్నయ్య దళిత కాలనీలో పర్యటించి, వివరాలను తెలుసుకున్నారు. గ్రామంలో ఒకే ట్యాంకును నింపడం ద్వారా నీటి సమస్య నెలకొన్నట్లు గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. గ్రామంలో అన్ని కాలనీలకు నీటి సరఫరా అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని మిషన్ భగీరథ అధికారులను ఎంపీడీఓ ఆదేశించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు



మీసేవ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈడీఎం శివ

అయిజ: మీసేవ కేంద్రాలను నిర్వహించే వారు నిబంధనల ప్రకారం నడుచుకోవాలని, నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవని ఈడీఎం (ఈ డిస్టిక్ మేనేజర్) శివ హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని మీసేవ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మీసేవ సెంటర్‌లో ధరల పట్టిక బోర్డు ప్రజలకు కనిపించేవిధంగా ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి మీసేవ సెంటర్ నిర్వాహకులు ఆన్‌లైన్ లావాదేవీల రికార్డు నమోదు చేయాలని, నోటీస్ బోర్డు, హెల్ప్‌లైన్ డెస్క్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. కొన్ని మీసేవ కేంద్రాల్లో ప్రభుత్వం నిర్దేశించిన రుసుం కంటే అధికంగా వసూలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఎం సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎస్‌ఐగా పదోన్నతి

గద్వాల క్రైం: గద్వాల రూరల్ పోలీసు స్టేషన్‌లో ఏఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న యం వెంకటేషగౌడుకు రాష్ట్ర పోలీసుశాఖ ఎస్‌ఐగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు గురువారం ఎస్పీ కార్యాలయంలో ఆయనను అభినందించి మాట్లాడారు. ప్రజలకు, బాధితులకు పోలీసు శాఖ జవాబు దారిగా వ్యవహరించాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం వచ్చే బాధితులకు త్వరగా విచారణ చేపట్టి పోలీసుశాఖపై నమ్మకం కలిగేలా విధులు నిర్వహించాలన్నారు.

చర్యలు తీసుకోండి

అయిజ: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ సభ్యులు గురువారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జ్యోతికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహులు మాట్లాడారు. పర్యావరణానికి హాని కలిగించే వ్యక్తులు, సంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరారు.అంతర్జాతీయ స్థాయిలో బిజినెస్ సంస్థలు ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ వస్తువులు వాడడం వల్ల కలుషితం ఏర్పడి జీవరాశుల మరణానికి దారితీస్తుందన్నారు. పర్యావరణాని హాని కలిగించే వాటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీవీవీయూ సభ్యులు జములమ్మ, మంజుల, నరసింహులు, తిప్పయ్య, శివరాజు, ప్రశాంతి, మల్లమ్మ పాల్గొన్నారు.

సీఐడీ కార్యాలయానికి కానిస్టేబుల్ బదిలీ

ఉండవెల్లి: మండలంలోని పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ రాజశేఖర్ హైదరాబాద్‌లోని సీఐడీ కార్యాలయానికి బదిలీ కావడంతో అతనిని సీఐ రవిబాబు, ఎస్‌ఐ మహేష్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ గఫార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులను విడుదల చేయాలి

ఉండవెల్లి: మండల కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జీకే ఈదన్న, సీఐటీయూ ప్రైవేటు ట్రాన్స్‌పోర్టు రంగం జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో రాజోళి మండలం పెద్ద ధన్వాడలో రైతులపై దాడి, అరెస్టును ఖండిస్తున్నట్లు తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు తలెత్తే ఇథనాల్ కంపెనీని ఎత్తివేయాలని ధర్నా చేస్తున్న వారిపై కేసులు పెట్టి దాడి చేయడం సమంజసం కాదని, వెంటనే కేసులు ఎత్తివేయాలని, ఇథనాల్ ఫ్యాక్టరీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, మల్లేష్, నరసింహ, చిన్న వెంకటేష్ పాల్గొన్నారు.

నిర్లక్ష్య ధోరణి ఉద్రిక్తతకు దారితీసింది



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు కొంకల భీమన్న మాదిగ

శాంతినగర్: రాజకీయ నాయకుల నిర్లక్ష్య ధోరణి వల్ల పెద్ద ధన్వాడ ఇథనాల్ ఫ్యాక్టరీ వద్ద ఉద్రిక్తతకు దారితీసిందని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు కొంకల భీమన్న మాదిగ అన్నారు. వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని శాంతినగర్‌లో ప్రజా సంఘాల నాయకుల ఆధ్వర్యంలో గురువారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు భీమన్న మాట్లాడుతూ ప్రస్తుత ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ ఇథనాల్ ఫ్యాక్టరీ సమస్య పరిష్కరించకుండా తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. నాయకులకు చిత్తశుద్ధి ఉంటే ఎప్పుడో సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేవారన్నారు. మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ ఇథనాల్ కంపెనీ రద్దు చేయాలని 12 గ్రామాల ప్రజలు చేపట్టిన దీక్షలను విరమించే విషయంలో చూపించిన శ్రద్ధ ఇథనాల్ ఫ్యాక్టరీ రద్దు చేయించడంపై చూపలేదని వాపోయాడు. ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడు దీక్షలకు మద్దతు, సంఘీబావాలు తెలపడం, ప్రభుత్వం దృష్టికి సమస్య తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని చెబుతూ దాటవేసే ధోరణి అవలంబిస్తున్నారని ఆరోపించారు. బుధవారం జరిగిన సంఘటనలో అమాయకులు జైలు పాలయ్యారని, ఇకనైనా ఇథనాల్ కంపెనీ రద్దు విషయంలో ప్రజాప్రతినిధులు, రూలింగ్ పార్టీ నాయకులు స్పందించి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి అనుమతులు రద్దు చేయించాలన్నారు. అమయాకులపై పెట్టిన కేసులు కొట్టి వేయించి 12 గ్రామాల ప్రజలు, రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు మస్తాన్ మాదిగ, ఎంఎస్‌పీ జిల్లా కన్వీనర్ రాజు మాదిగ, యేసేపు మాదిగలు పాల్గొన్నారు.

భూసారం పెంచేందుకు చర్యలు తీసుకోవాలి

- పాలెం శాస్త్రవేత్త డాక్టర్ నళిని



మాట్లాడుతున్న పాలెం శాస్త్రవేత్త డాక్టర్ నళిని

ధరూరు: రైతులు పంట పొలాల్లో రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి భూసారం పెంచేందుకు కృషి చేయాలని పాలెం శాస్త్రవేత్త డాక్టర్ నళిని అన్నారు. గురువారం మండలంలోని ఉప్పేరు గ్రామ రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' అనే అంశంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యూరియా అధిక మోతాదులో వాడడం ద్వారా పంటకు పురుగు బెడద తీవ్రమవుతుందన్నారు. యూరియా వాడకాన్ని పూర్తిగా తగ్గించి పంటలను సాగు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం చే గుర్తింపు పొందిన, ఐఎస్‌ఐ మార్కుల కలిగి సర్టిఫైడ్ కంపెనీల విత్తనాలనే ఎంపిక చేసుకోవాలన్నారు. గ్రామాల్లో వ్యవసాయ అధికారులు, విస్తరణ అధికారులు సూచించే విధంగా విత్తన ఎంపిక చేసుకోవాలన్నారు. భూసారాన్ని పెంచేందుకు చెట్లు ఎంతగా దోహదపడతాయన్నారు. చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. ఈ సందర్భంగా బ్రోచర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారిణి శ్రీలత, ఏఈఓలు, తదితరులు పాల్గొన్నారు.